# కృషి రూపెత్తిన రుషి
# డాక్టరు వెలగా వెంకటప్పయ్య

**సంపాదకులు**

**శ్రీ పావులూరి శ్రీనివాసరావు**

M.A., M.Com., MLISc, M.Phil.,

ప్రధాన గ్రంథాలయాధికారి

ఎ.ఎస్.ఆర్. కళాశాల, గుడివాడ

**పావులూరి శ్రీనివాసరావు**

కార్యదర్శి : పావులూరి ట్రస్టు

13/340, పాటిమీద, గుడివాడ - 521 301

తొలిముద్రణ

**2017**

వెల : అమూల్యము

ప్రతులకు

**పావులూరి శ్రీనివాసరావు**

కార్యదర్శి : పావులూరి ట్రస్టు

13/340, పాటిమీద, గుడివాడ - 521 301

Cell : 94404 92235

e-mail : 1957psrinivas@gmail.com

ముద్రణ

**నాగేంద్ర ఆఫ్‌సెట్**

విజయవాడ

డి.టి.పి

**ఆర్.ఆర్. గ్రాఫిక్స్, తెనాలి**

# ముందుమాట

డాక్టరు వెలగా వెంకటప్పయ్య గారి జీవితం తెరిచిన పుస్తకం. రేపటి తరానికి పఠనీయ గ్రంథం. గ్రంథాలయ రంగంలో నిస్వార్థ సేవలందించిన మహనీయుల వరుసలో ఇప్పుడు వెంకటప్పయ్య గారి పేరును చేర్చవచ్చు. కేవలం గ్రంథాలయాల అభివృద్ధికే కాకుండ, తెలుగు నాట బాల సాహితీ వికాసానికి, సామాజిక ప్రయోజనం గల రచనలు చేయడానికి ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసిన సాహితీమూర్తి మన వెలగా వారు.

కొంతమంది ప్రచారం కోసం పనిచేస్తారు. మరికొంతమంది గుర్తింపుకోసం, ఇంకొంతమంది వ్యక్తిగత ప్రతిష్ఠకోసం చేస్తుంటారు. ఏ స్వప్రయోజనాన్ని, స్వలాభాన్ని ఆశించకుండా జీవితాన్ని గ్రంథాలయాల వికాసానికి, విలువైన పుస్తకాల రచనకు వినియోగించిన విశిష్ట వ్యక్తి డాక్టరు వెలగా వెంకటప్పయ్య గారు.

వెలగావారికి పుస్తకాలే ఆస్తి. గ్రంథాలయాలే సంపద. 84 సంవత్సరాల సుదీర్ఘ జీవిత ప్రస్థానంలో రమారమి 60 సంవత్సరాలు అలుపెరుగని సమాజ, సాహిత్య, సాంస్కృతిక సేవ చేసిన అరుదైన వ్యక్తి వెంకటప్పయ్య గారు.

"ప్రీతిగూర్చునొ అతడె ధన్యుడు" అన్న మహాకవి శ్రీ గురజాడ మాటలు డాక్టరు వెలగా వెంకటప్పయ్య గారికి అక్షరాలా వర్తిస్తాయి. నడిచే గ్రంథాలయంగా, కదిలే జ్ఞానాలయంగా, పుస్తకాలే సమస్తంగా జీవించిన వెంకటప్పయ్య గారు పరోపకారతత్వం, మానవత్వం, ఋషితత్వం మూర్తీభవించిన మనతరం మహోన్నత వ్యక్తి. వారికి ఆత్మీయ అక్షర నివాళి.

*– డాక్టర్ బీరం సుందరరావు*



# డాక్టరు వెలగా వెంకటప్పయ్య

- ఈ తరంలో గ్రంథాలయ జ్యోతికి కొత్త వెలుగు అందించిన ప్రముఖులు.
- గ్రంథాలయ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా కృషి సల్పి, గ్రంథాలయోద్యమానికి మారుపేరుగా నిలిచిన సేవావ్రతులు.
- బాలసాహిత్యంలో అపారమైన కృషిసల్పి 'బాలబంధు' గౌరవం పొందిన సాహితీవేత్త.
- భారత ప్రభుత్వం నుంచి వయోజన విద్యారచనలో మూడుసార్లు జాతీయస్థాయి బహుమతి గ్రహీత.
- కృషి రూపెత్తిన రుషి, సౌజన్యమూర్తి.

# కృషి రూపెత్తిన రుషి
# డాక్టరు వెలగా వెంకటప్పయ్య

సహస్ర చంద్ర దర్శన సుదీర్ఘ కాలయవనికలో డాక్టరు వెలగా వెంకటప్పయ్యగారి సేవలు ప్రధానంగా గ్రంథాలయ, సాహిత్య రంగాలలో ప్రత్యేకంగా ప్రశంసించదగినవి. గ్రంథాలయ రంగంలో నిబద్ధతతో, అంకిత భావంతో పనిచేసిన కాలంలో “గ్రంథాలయాలకి మారుపేరుగా నిలిచారు” అన్నారు డా॥ నాగభైరవ. “వెంకటప్పయ్య అనే పేరు గ్రంథాలయానికి మరో పేరు అయ్యింది” అన్నారు సంజీవదేవ్. గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య (పద్మశ్రీ పురస్కార గ్రహీత), వెలగా వారిని తన వారసులుగా గుర్తించి అభినందించి, ఆశీర్వదించారు. వాస్తవానికి అయ్యంకి వెలిగించిన గ్రంథాలయ జ్యోతిని మరో తరానికి తీసుకెళ్ళింది వెలగావారే.

నమ్రత, నిరాడంబరత, సున్నితత్వం మూర్తీభవించిన డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారు, మందస్మిత వదనం, మాటల్లో సౌజన్యం, వచ్చినవారి ఎడ ఆదరణ, ఆప్యాయత, చిరుమందహాసంతో వచ్చిన వారందరితో మాట్లాడటం వారందరికీ తోచిన సూచనలు ఇచ్చి పంపడం, వచ్చిన వారు చెప్పింది ఎంతో శ్రద్ధగా వినడం, తదనుగుణంగా వ్యవహరించడం మనకు నిత్యం కనిపించే దృశ్యం.

## చదువు-సంధ్యలు

వెలగా వెంకటప్పయ్య గారు తెనాలి పట్టణంలోని ఐతానగరంలో 1932లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. జీవితం అందరికీ వడ్డించిన విస్తరి కాదు. జీవితంలో ఒక్కసారైనా అందరినీ అదృష్ట దేవత పలకరిస్తుందంటారు. ఏదో సమయంలో తలుపు తడుతుందని అంటారు. కానీ వెంకటప్పయ్య గారి జీవితంలో అది తారసపడలేదు. ఆయన స్వయంకృషి, క్రమశిక్షణతో తన జీవితాశయాన్ని ఇటుకపై ఇటుక పెట్టి

నిర్మాణం పూర్తిచేసినట్లు నిర్మించుకున్నారు. అప్పటికి తెనాలిలో జూనియర్ కళాశాల లేదు. స్కూలు ఫైనల్ పూర్తి చేసిన రెండేళ్లకు తెనాలిలో కాలేజి వచ్చింది. ఇంటర్మీడియట్ ఎలాగో పూర్తి చేసేటప్పటికి మళ్లీ సమస్య. అప్పటికి ఇంకా డిగ్రీ కళాశాల లేదు. అలా అని గుంటూరు వెళ్లి చదివే స్తోమత లేదు. మళ్లీ చదువాగిపోయింది.

## స్వయంశోధిత పరిశోధకుడు

1956 సమయంలో వెంకటప్పయ్యగారు పై చదువుల కోసం నిరీక్షించకుండా దొరికిన ఉద్యోగంలో చేరిపోయారు. ఉద్యోగం చేస్తూనే ప్రైవేటుగా డిగ్రీ, ఎం.ఏ., పిహెచ్.డి పూర్తి చేశారు. ఎంతో పట్టుదల, దీక్ష ఉంటే తప్ప ఇది సాధ్యం కాని పని. వెలగా వెంకటప్పయ్య హైస్కూల్ చదువుతోనే తృప్తి పడి ఉద్యోగాన్వేషణలో పడక తప్పలేదు. ఫలితంగా లోకల్ లైబ్రరీస్ అథారిటీస్‌వారి శాఖా గ్రంథాలయంలో చిన్న ఉద్యోగిగా చేరి మూడు దశాబ్దాల పాటు వివిధ హోదాలలో పనిచేశారు. డాక్టర్ వెలగా చిన్న ఉద్యోగిగా చేరినది మొదలు స్వయంకృషితో అన్ని పరీక్షల్లోనూ కృతార్థు లవుతూ, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు తెలుగు సాహిత్యంలో ఎం.ఎ. పట్టా పుచ్చుకున్నారు. అంతకుముందే ఉస్మానియా యూనివర్సిటీ నుంచి లైబ్రరీ సైన్స్‌లో డిప్లొమా పొందారు. అంతేనా! 1971 వచ్చేసరికి ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు 'తెలుగులో బాల సాహిత్య వికాసం, ఆంధ్రప్రదేశ్‌లో బాలల గ్రంథాలయాల ప్రగతిపై వీరు చేసిన పరిశోధనా కృషికి పిహెచ్.డి.,ని బహూకరించారు. పిహెచ్.డి., పట్టా రావడంతో వెలగా వెంకటప్పయ్య డాక్టర్ వెంకటప్పయ్యగా నలుగురికీ బాగా తెలిసిపోయారు.

## నిత్య జీవన విధానం

తెనాలి వెళ్ళినప్పుడు ఉత్సాహంతో వెంకటప్పయ్యగారిని చూద్దామని అనిపిస్తే అడ్రెస్ కోసం మనం ఏం ప్రయాసపడవలసిన పనేంలేదు. రెండేళ్ళ

క్రిందటే తెనాలి మునిసిపాలిటీ 'వెలగా వెంకటప్పయ్యవీధి, అని తీర్మానించింది గనుక వెలగా వెంకటప్పయ్య వీధి అని చెప్పండి. ఎవరైనా మిమ్మల్ని అక్కడికి చేరుస్తారు లేదా అడ్రెస్ చేప్తారు.

వెలగావారి వీధికి వెళ్ళారా? వారింట్లో లేరా? నిరాశపడకండి. నాల్గు బొమ్మల సెంటర్‌కు రండి. అక్కడే ఉన్న ఏదో ఒక డి.టి.పి. ఆపరేటర్ దగ్గర ఉండి తాను రాస్తున్న ఓ పుస్తకాన్నో – ఇతరులు రాసిన ఎవరి జీవిత చరిత్రనో, అడిగిన వారికి ప్రత్యేక సంచికలు, సావనీర్లు డిటిపి చేయిస్తూ ఉండి ఉంటారు. అలా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఎక్కడో ఓ చోట పనిచేస్తూనే ఉంటారు. మధ్యాహ్నం ఒకింత విశ్రాంతి. చల్లటి కాలమైతే పరుగో పరుగు! మళ్ళా 3 గంటలకు వెళ్లి రాత్రి 8 గంటలకు తిరిగి రావడం. తన పనిలో నిమగ్నులవడం – కాస్తంత నిద్ర – మరెప్పుడు మెలకువ వస్తే అప్పుడే తన కుర్చీలో కూర్చుని పని – ఇదీ దినచర్య. పై కార్యక్రమాలతో పాటు మిత్రులూ – రచయితలూ – ఎందరో వెంకటప్పయ్య గారి సలహాల కోసం రావడం – మరెందరో ఫలానాచోట ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నాం – తమరు తప్పక రావాలని ఆహ్వానించడం – ఇలా ఎన్నో కార్యక్రమాలు ప్రతిరోజూ వెంకటప్పయ్యగారి రాక కోసం ఎదురు చూస్తూనే ఉంటాయి. ప్రతిరోజూ అసంఖ్యాకంగా వచ్చే ఉత్తరాలు వస్తూ ఉంటే వాటికి జవాబులూ వెంట వెంటనే రాసి పోస్టు చేయడం – లేఖన కళ పట్ల వారేమి అనురక్తి కనపరుస్తున్నారో ఆశ్చర్యమేస్తుంది. లేఖన కళలో వెంకటప్పయ్యగారు నిష్ణాతులు. మన వారు గమనించరు కాని, ఉత్తరాల్లో అతి తక్కువ పదాలను ఉపయోగిస్తారు. అయితేనేం? అవెంత ముఖ్యమైన విషయాన్ని, గురుతరమైన, బాధ్యతను – మరెంత బలంగా చెప్తాయో వారి నుంచి ఉత్తరాలు అందుకున్న వారికి తెలుస్తుంది. వారి ఉత్తరాలలోని సొగసు – రాయడంలోని మెళకువలు, వీటితో పాటు కొరియర్లు తెచ్చే విలువైన సమాచారం, పుస్తకాలు – వీటన్నిటికీ తగినట్టుగా వెంట వెంట స్పందించి వారికి తగిన సూచనలు – టెలిఫోన్లో కాని – ఉత్తరాల ద్వారా కానీ చెప్పడం.

వెంకటప్పయ్యగారు తన స్వంత పుస్తకాల రచనలతో పాటు తన వద్దకు వచ్చే వారిలో కాని – తనకు తెలిసిన వారెవరిలో కాని ఏమాత్రం పని నైపుణ్యం ఉన్నా – వారిని ప్రోత్సహించి ఓ పుస్తకాన్ని రచింప చేయడం – అలా ఓ రచయితను తెలుగువారికి పరిచయం చేయడం – అలా వారిచే ప్రోత్సాహంతో రచనలు చేసిన వారెందరో!

తమ ప్రాంతంలో ఉండి గతించిపోయిన ప్రతిభావంతులెందరో తమకు తెలుసుగనుక – వారి కుటుంబీకులను ప్రోత్సహించి, సమాచారం సేకరించడంలో తోడ్పడి వారి ద్వారా ఓ పుస్తకాన్ని రాయించి ప్రచురించడం ఎందరి విషయంలోనో జరిగింది. ఇలా వెంకటప్పయ్య గారి చేతుల్తో ఎన్నో జీవిత చరిత్ర గ్రంథాలు  అలవోకగా తయారయ్యాయి.

ప్రతి రోజూ ఎక్కడో ఓ చోట ఓ సాహితీ సమావేశం. ఆనాడు తాను తెనాలిలో ఉంటే గనుక – ఆ కార్యక్రమమంతా వెంకటప్పయ్యగారే వెనుక ఉండి నిర్వహిస్తారు. ప్రతి మంచి కార్యక్రమంలో పాల్గొనడమే కాదు – ఎందరికో స్ఫూర్తి కలిగిస్తారు. మరెందరికో మార్గదర్శకులవుతారు.

లైబ్రేరియన్‌గా ఉండి అనుభవంతో, ఆలోచనతో గ్రంథాలయ శాస్త్రంలో 80కి పైగా రచనలు చేశారు. మరో మూడు వందల వ్యాసాలు రాశారు.

## గ్రంథపాలకునిగా చెరగని ముద్ర

చాలా మంది అతి సాధారణంగా 'బతికేస్తా'రు. కానీ కొద్దిమందే పది కాలాల పాటు చరిత్రలో గుర్తిండిపోయేలా 'జీవిస్తా'రు. వెలగా అటువంటి కోవకు చెందిన వ్యక్తి. ఆయన 1969లో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా పదోన్నతి పొందారు. 1990లో పదవీ విరమణ చేశారు. ఆ మధ్య కాలంలో పనిచేసిన ప్రతిచోటా తనదైన ముద్ర వేశారు. ఎంతో చొరవ చూపుతూ, చాకచక్యం కనబరుస్తూ గ్రంథాలయాల ఉద్ధరణకు పాటుపడ్డారు. పనిచేసిన

ప్రతిచోటా గ్రంథాలయాలకు సొంత భవనాలు, నిర్మాణాల కోసం కృషి చేశారు. గ్రంథాలయాలలో తరచుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వాటిని సాంస్కృతిక కేంద్రాలుగా తీర్చిదిద్దారు. ప్రతి గ్రంథాలయంలోనూ పాఠ్య గ్రంథాల విభాగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయించారు. లెక్కలేనన్ని ఉచిత గ్రంథాలను సేకరించి భద్రపరిచారు. వాటిని అందరికీ పరిచయం చేశారు. వీలు కుదిరినప్పుడల్లా కవులు, కళాకారులు, రచయితలను గ్రంథాలయాలకు ఆహ్వానించేవారు, వారిని ప్రోత్సహిస్తూ విజ్ఞాన భాండాగారాల సర్వతోముఖాభివృద్ధికి గట్టి పునాదులు వేశారు.

## గ్రంథాలయ సమాచార శాస్త్ర రంగం

గ్రంథాలయరంగంలో అత్యంత బాధ్యతాయుతమైన క్లిష్టమైన పరిపాలనా సంబంధ పదవి నిర్వహిస్తూ గ్రంథాలయ శాస్త్ర బోధనలో పలు విశ్వవిద్యాలయాలలో భాగస్వాములయ్యారు. సర్టిఫికెట్, డిగ్రీ స్థాయిలో అన్ని పాఠ్యగ్రంథాలు, వివరణాత్మక నిఘంటువులు, ఉద్యమ చరిత్ర, ప్రసిద్ధ గ్రంథాలూ సర్వసమగ్రంగా ఒక్క చేతి మీదుగా సచిత్రంగా వెలుగులోకి తెచ్చారు. లైబ్రరీ సైన్స్ రచనల్లో డాక్టర్ వెలగా వారు సాధించిన ప్రమాణాలు చాలా ఉన్నతమైనవి. వీరి గ్రంథాలు ఆంధ్రప్రదేశ్ అన్ని గ్రంథాలయాలలోనే కాక అమెరికా, కెనడా, నెదర్లాండ్, ఇజ్రాయిల్, జపాన్, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా మొదలైన దేశాలలో 78 గ్రంథాలయాలలో లభిస్తాయని వరల్డ్ క్యాట్ నెట్‌వర్కు ద్వారా తెలుస్తుంది. వీరి రచనల్లో విశిష్టాంశం. పాశ్చాత్య శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాల సంవిధానాలను తెలుగు గడ్డపై నెలకొన్న గ్రంథాలయాల నిర్వహణ అమరికకు అనుగుణంగా రూపొందించ బడినవి కనుకనే!

డాక్టర్ వెలగా వారి రచనల్లో తెలుగు పలుకుబడి ఎంత పరిమళిస్తుందంటే చదువరి విషయ సరళీకరణకు ముగ్ధుడైపోతారు. సాధారణ పాఠకులు కూడా వీరి రచనలు కాలు మీద కాలు వేసుకుని చదువుకుంటారు.

వీరి వ్యాసాలలో ఎత్తుగడ – ముగింపులు ప్రత్యేకంగా, విలక్షణంగా ఉంటాయి. అలాగే, గ్రంథాలయ శాస్త్రంలో వీరు రచించిన అనేక పుస్తకాలు చదువరులను ఉత్సాహపరచడమే కాదు - ఎందరో పాఠకులను అలరించాయి.

## సాహిత్యరంగం

ముఖ్యంగా బాల సాహితీరంగంలో వారి కృషి అనుపమానం. చందమామ సంపాదకులు చక్రపాణిగారు జన్మించిన గ్రామంలో వారూ జన్మించడం పుర్వాకృత సుకృతం అంటారు. అందుకే వారు 1949 నుంచి బాలసాహిత్యంలో శతాధిక రచనలు చేశారు. 12 శతకాలకు టీకా తాత్పర్యాలతో వెలయించారు. పిల్లల పొడుపు కథలు, సామెతలు, గేయాలు, జాతీయాలు సహస్రాధికంగా సేకరించి ప్రచురించారు. తెలుగు జాతి సంస్కృతి సంపత్తిని తెలియజేసే, ఒక విజ్ఞాన సర్వస్వాన్ని పోలిన గ్రంథం "మన వారసత్వం'' ప్రచురించగా పొట్టి శ్రీరాములు తెలుగు గ్రంథంగా పురస్కారమిచ్చి సత్కరించాయి. తెలుగు బాలసాహిత్య పరిషత్ అధ్యక్షులుగా నాలుగు దశాబ్దాల పాటు బాలసాహిత్య ప్రగతికి తోడ్పడ్డారు. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్టు, రిషివ్యాలీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో బాల రచయితల శిక్షణ శిబిరాలు నిర్వహించి, వారిని ప్రోత్సహించారు.

నార్ల వెంకటేశ్వరరావు, ఆవుల సాంబశివరావు, సి.ఆర్. రెడ్డి, సంజీవదేవ్, కొసరాజు, న్యాపతి రాఘవరావు, అయ్యంకి, చక్రపాణి, పి.ఎన్. కౌలా తదితరుల సంపూర్ణ గ్రంథాలను ప్రచురించి జాతికి మహోపకారం చేశారు. 20వ శతాబ్ది తెలుగు వెలుగుల పేరుతో నాలుగు సంపుటాలలో తెలుగు ప్రముఖుల పరిచయాలు వెలయించారు. ఇదే కోవలో అందరూ మహానుభావులే అనే మరో బృహత్తర గ్రంథం గత సంవత్సరం వెలువడింది.

వారు చేసిన సత్కార్యాలలో ముఖ్యమైనవి ప్రొఫెసరు పి.ఎన్.కౌలా, అయ్యంకి వెంకటరమణయ్య, ప్రొఫెసరు పర్వతనేని గంగాధరరావు, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, నాళం కృష్ణారావు, పరుచూరి రామకృష్ణగార్ల

పేర్లతో వివిధ విశ్వ విద్యాలయాలలో, ఏర్పరచిన ధర్మ నిధులు ప్రధానమైనవి. పావులూరి ట్రస్టుకు సహకారం అందిస్తున్నారు.

## గ్రంథాలయోద్యమ రంగం

గ్రంథాలయోద్యమానికి తన జీవితం అంకితం చేసిన ఆదర్శ ప్రాయులు డాక్టర్ వెలగా పాండిత్యం, పరిపాలనా దక్షత వారి భిన్న ప్రజ్ఞలు. డాక్టర్ వెంకటప్పయ్య గారి గుండెలో ఆ రెండు ప్రజ్ఞలు గంగా, యమునల వలె సంగమించాయి. డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు (మాజీ చైర్మన్, అధికార భాషా సంఘం, ఆంధ్రప్రదేశ్.) ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమంలో పోయిన వారు పోగా మిగిలిన వారిలో అగ్రగణ్యులు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, డాక్టర్ భావరాజు వెంకట నరసింహారావు. గ్రంథాలయ సమాచార శాస్త్ర అభివృద్ధికి కృషిలో పాల్గొన్నవారు తెలుగువారిలో అరుదు. గ్రంథాలయ శాస్త్రానికి చెందిన సాంకేతిక విషయక్షేత్రంలో వీరు రచించిన గ్రంథాలయ వర్గీకరణ, గ్రంథాలయ సూచీకరణప్రయోగ దీపికలు పౌర, చిన్న గ్రంథాలయాల్లో పనిచేసే వారికి చాలా ప్రయోజనం చేకూరుస్తాయి. పౌర గ్రంథాలయాల్లో పనిచేసే వారికి చాలా ప్రయోజనం చేకూరుస్తాయి. పౌర గ్రంథాలయాల్లో ఎదురవుతున్న చిక్కు సమస్యలను అధిగమించడానికి వీలుగా ఇతర దేశాల గ్రంథాలయాల నుంచి గ్రంథాలయ శాస్త్రవేత్తలు సూచించిన విధానాలను స్వీకరించి, మన దేశానికి అవసరమైన, అనుగుణమైన విధానాన్ని 'వర్గీకరణ నియమాలు', 'గ్రంథకర్త గుర్తులు', 'విషయ సూచికలు' రూపొందించారు. ఈ పద్ధతిలోనే మరింతగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయ శాఖ వారు అనుసరిస్తున్న విధానాన్ని కొంచెం సవరించి నూతన వర్గీకరణ జాబితాలను తయారు చేయడంలో డాక్టర్ వెంకటప్పయ్య గారు చేసిన కృషి మరువరానిది.

మొదటి నుంచి కూడా వెంకటప్పయ్యగారికి గ్రంథాలయ శాసనం అన్నా ఎంతో అభిమానం. పూర్వ పెద్దలెందరో చేసిన కృషిని అధ్యయనం

చేసి, స్వాతంత్ర్యానికి పూర్వం, తరువాత జరిగిన కృషిని గొప్ప అభినివేశంతో పరిశీలించారు. ఫలితంగా రెండు సంపుటాలలో ఇండియన్ లైబ్రరీ లెజిస్లేషన్‌ను వెలువరించారు.

గ్రంథాలయ చట్టాల నిర్మాణం, అమలుపై వివిధ ప్రాంతాలలో జరిగిన సమావేశాలలో పాల్గొని విలువైన అభిప్రాయాలను వెలిబుచ్చడమే కాదు తాను ప్రతిపాదించిన విషయాలను చర్చకు పెట్టి, ఫలితంగా 1955లో వీరు రూపొందించిన మోడల్ పబ్లిక్ లైబ్రరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్ యాక్ట్ దేశమంతటికీ వర్తించేలా ఆమోదింపచేశారు.

రచయితగా డాక్టర్ వెలగా వెంకటప్పయ్య చేసిన కృషి వాషింగ్టన్‌లో గల ప్రపంచ ప్రసిద్ధ గ్రంథాలయం, పది కోట్ల పుస్తకాలతో అయిదు వేల మంది సిబ్బందితో అలరారుతున్న దానిలో మన వెంకటప్పయ్యగారి లైబ్రరీ సైన్స్‌ను గురించి రాసినవి 27 పుస్తకాలు ఉన్నాయి. ఇన్ని పుస్తకాలు ఏ ఒక్క రచయితవీ లైబ్రరీలో ఉండిన వన్న విషయం తెలిసినప్పుడు ఏ తెలుగువాడి హృదయం ఉప్పొంగిపోదు?

సంపాదకుడిగా ఎన్నో పుస్తకాలను తీర్చిదిద్దారు. వీరు అనేక ప్రత్యేక సంచికలను, సంస్మరణ సంచికలకు సంపాదకత్వం వహించడమే కాదు – పై ప్రత్యేక సంచికలకు సమర్థులైన వారి చేత వ్యాసాలు రాయించి వాటిని శ్రద్ధగా పరిశీలించి – ఆ వ్యాసం ఎడ తన అభిప్రాయాన్ని ప్రకటించి, ప్రోత్సహించి మరింత శ్రద్ధగా రచనలను కుదించి చదువరులకు ఎంతో విజ్ఞాన వికాసాలు కలిగేట్టుగా రూపుకట్టించేవారు. తన ఆధ్వర్యంలో వెలువడుతున్న ప్రతి పుస్తకం తన మస్తిష్కంలో రూపు కట్టుకున్న తీరులో అచ్చులో కాని, బైండింగ్‌లో కాని వచ్చితీరాలి ఎక్కడా తేడా వుండకూడదు.

విషయ సూచిక మొదలు – ఆసాంతం అహోరాత్రులు కృషి చేసి పుస్తకం పూర్తయ్యేవరకు నిద్ర పోయేవారు కాదు. కొన్ని కొన్ని సందర్భాల్లో మంచి పుస్తకం వెలువరించడానికి ఆర్థిక వనరులు చేకూర్చడంలో కూడా పాలు పంచుకునే వారు.

డాక్టర్ వెలగా సంపాదక బాధ్యత వహించి వెలువరించిన వాటిలో ముఖ్యమైనది అయ్యంకి వెంకటరమణయ్యగారి వ్యాస సంపుటి 'గ్రంథాలయ జ్యోతి', 'గ్రంథాలయ వాణి', అయ్యంకి వెంకటరమణయ్య శత జయంతి సంచిక, విశాలాంధ్ర వారు ప్రచురించిన 'భారత గ్రంథాలయోద్యమం', 'కాలం అభినందన సంచిక', 'మార్చ్ ఆఫ్ లైబ్రరీ సైన్స్' అందులో ముఖ్యమైనవి.

ప్రామాణికమైన రచనలు చేసి, విశేష అనుభవం గడించిన డాక్టర్ వెంకటప్పయ్య గారిని గెస్ట్ ఎడిటర్‌గా ఉంచి ఎందరో ప్రచురణ కర్తలు గౌరవించారు. వెంకటప్పయ్యగారి రచనలలోని విషయజ్ఞతను, రచనా పాటవాన్ని, నిర్వహణా సామర్ధ్యాన్ని గుర్తించి వారిని మన్నించిన తీరు ఇది.

గ్రంథాలయ శాస్త్రంలో తెలుగులో రచనలు ప్రారంభించిన వారిలో "కళాప్రపూర్ణ" పాతూరి నాగభూషణం గారు ప్రథములు. వీరి తరువాత పైవారికంటే అధికంగా కృషి చేసిన ఖ్యాతి డాక్టర్ వెంకటప్పయ్యగారికి చెందుతుంది. గ్రంథాలయ శాస్త్ర సాంకేతిక రంగంలో సిద్ధాంతానికంటే ఆచరణకు అధిక ప్రాధాన్యం ఇచ్చి అందుకు అనుగుణమైన ప్రామాణిక రచనలనెన్నిటినో చేశారు.

లైబ్రరీ సైన్స్ రచనల్లో డాక్టర్ వెలగా వారు సాధించిన ప్రమాణాలు చాలా ఉన్నతమైనవి. తెలుగునాట ఉన్న ఏ గ్రంథాలయానికి వెళ్ళినా వెంకటప్పయ్య గారి పుస్తకాలు మనకు కనిపిస్తాయి. వీరి రచనల్లో గల విశిష్టాంశం. పాశ్చాత్య శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాలను, సంవిధానాలను తెలుగు గడ్డపై నెలకొన్న గ్రంథాలయాల నిర్వహణకు, అమరికకు అనుగుణంగా రూపొందించబడింది కనుకనే!

డాక్టర్ వెలగా వారి రచనల్లో తెలుగు పలుకుబడి ఎంతగా పరిమళిస్తుందంటే చదువరి విషయ సరళీకరణకు ముగ్ధుడైపోతాడు. సాధారణ పాఠకుడు కూడా వీరి రచనను కాలు మీద కాలు వేసుకుని చదువుకుంటారు. వీరి వ్యాసాలలో ఎత్తుగడ – ముగింపులు ప్రత్యేకంగా విలక్షణంగా ఉంటాయి.

అలాగే, గ్రంథాలయ శాస్త్రంలో వీరు రచించిన అనేక పుస్తకాలు చదువరులను ఉత్సాహపరచడమే కాదు – ఎందరో పాఠకులను అలరించాయి.

డాక్టర్ వెలగా వెంకటప్పయ్య ఉద్యోగ రీత్యా గ్రంథాలయ పాలకుడైనా – సహజంగానే పుస్తక ప్రియుడు. ఇలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారు. రాష్ట్రమంతటా అన్ని జిల్లాల నుండి ఎందరో పండితులు, పరిశోధకులు, రచయితలు, విద్యార్థులు వారికి కావలసిన సమాచారం, పుస్తకాల గురించి అడుగుతూ ఉంటారు. కోరిన వారిని నిరుత్సాహపరచకుండా తన వద్ద ఉన్న పుస్తకాలనే కాకుండా మిగతా చోట్ల నుంచి తెప్పించి వారి కృషికి, గ్రంథ రచనకు తోడ్పడడం, ప్రోత్సహించడం తమ కర్తవ్యంగా భావిస్తారు. రాష్ట్రంలో వ్యక్తిగత గ్రంథాలయాలు కలిగిన వ్యక్తులందరూ వెంకటప్పయ్య గారిని ఎరిగిన వారు కనుక ఈరకంగా వీరు ఇతరులకు సహకరించ గలుగుతున్నారు. ప్రతీ విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందన్న నానుడినీ నిజం చేస్తూ వెంకటప్పయ్య గారి కృషి వెనుక, సాధించిన విజయాల వెనుక ఆయన సతీమణి శ్రీమతి నాగేంద్రమ్మ గారి తోడ్పాటు, ఎంతో ఉందన్నది వాస్తవం.

డాక్టర్ వెంకటప్పయ్య భారతదేశమంతటా గల గ్రంథాలయాలను దర్శించడమే కాదు, అన్నిటినీ తనదైన ధోరణిలో అధ్యయనం చేశారు. మనదేశంలో జరిగిన గ్రంథాలయ సభలకే కాకుండా వివిధ రకాల సభలకూ సమావేశాలకు సదస్సులకు, గోష్ఠులకు హాజరవుతుంటారు కనుక – తన విజ్ఞాన పరిధిని ఎంతగానో పెంచుకున్నారు.

జ్ఞాపకశక్తి, సద్యః స్ఫూర్తి వినయశీలత వీరిని ఇంతటివారిగా తీర్చిదిద్దాయి. డాక్టర్ వెలగా వెంకటప్పయ్య గ్రంథాలయ సేవలో పండిన యువకుడు. సరస్వతీ పుత్రుడు. కళాదృష్టి, సౌందర్య పిపాస, సహృదయం, మంచి అభిరుచులు వీరికి ఏడువారాల నగలు! ఏ పనిచేసినా అందంగానూ పరిపూర్ణంగానూ చేయాలనే తపన. పరిపూర్ణత్వానికీ సమగ్రతనూ

లక్షిస్తుంటారు. తన రచనల్లో పరిపూర్ణత్వం సాధించడానికి ఇంత వయస్సు లోనూ నిత్యం కృషి చేస్తూనే ఉంటారు.

## గ్రంథాలయ చట్టం అమలులో చొరవ

గ్రంథాలయాల పాలనలో అపార అనుభవం, అవగాహన కలిగిన డాక్టర్ వెంకటప్పయ్య.. వాటికి సంబంధించిన చట్టాలపై గట్టి పట్టున్న వ్యక్తి. ఇటీవలే పాండిచ్చేరి ప్రభుత్వం 'పౌర గ్రంథాలయ చట్టం – ముసాయిదా' తయారీకి ఆయనను ఆశ్రయించింది. పౌర గ్రంథాలయ శాఖలో పనిచేస్తూ గ్రంథాలయ చట్టం అమలు చేయడంలో ఆయనెంతో నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఆ అనుభవంతోనే ఆయన ప్రస్తుత చట్టాలలోని లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్ది ఆచరణ సాధ్యమైన పద్ధతిలో 1979 నుంచి మాదిరి పౌర గ్రంథాలయ చట్టాలను రూపొందిస్తూ వచ్చారు. భారత గ్రంథాలయ సంఘం కోరిక మేరకు మరో మాదిరి చట్టాన్ని ఆయన రూపొందించగా, 1989లో న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి సదస్సులో అది ఆమోదం పొందింది. డాక్టర్ వెంకటప్పయ్య రూపొందించిన 'మోడల్ స్టేట్ పబ్లిక్ లైబ్రరీ పాలసీ అండ్ మోడల్ పబ్లిక్ లైబ్రరీస్ అండ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ యాక్ట్' జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. గ్రంథాలయ చట్టాలకు సంబంధించి తన అపార అనుభవాన్ని, విజ్ఞానాన్ని రంగరించి ఐదు గ్రంథాలను వెలుపరించారు. ఒడిసా, బీహారు రాష్ట్రాలలో అమలు చేస్తున్న ప్రస్తుత చట్టాలలో కొన్ని అంశాలను వెంకటప్పయ్య తయారుచేసిన మాదిరి చట్టాల నుంచే స్వీకరించారు.

## సంపాదకత్వంలో మేటి...

డాక్టర్ వెలగా వెంకటప్పయ్య గారు ఓ విజ్ఞాన కోశం. గత రెండు వందల ఏళ్ల కాలంలో ముద్రించిన, వచ్చిన గ్రంథాలపై విశేషమైన అవగాహన ఉంది. ఏ గ్రంథం ఎప్పుడు అచ్చయిందో, దాని అనుపానులేమిటో ఆయన ఇట్టే చెప్పగలరు. ఈ అనుభవం వల్లనే కొందరు ప్రచురణ కర్తల సంపూర్ణ

రచనలను సంపుటాలుగా తెచ్చే బాధ్యతను వెంకటప్పయ్య గారికి అప్పగించారు. రేడియో అక్కయ్య న్యాపతి కామేశ్వరి, డాక్టర్ సంజీవదేవ్, నార్ల వెంకటేశ్వరరావు, శరణు రామస్వామి చౌదరి, జస్టిస్ ఆవుల సాంబశివరావు, చక్రపాణి, సర్ సీఆర్ రెడ్డి తదితర ప్రముఖుల రచనలు వెంకటప్పయ్యగారి సంపాదకత్వంలోనే వెలువడ్డాయి. గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య గారి సంపూర్ణ రచనలు వీరి సంపాదకత్వంలో 'గ్రంథాలయ జ్యోతి' పేరిట ప్రచురిత మయ్యాయి. ఈ గ్రంథరాజం అప్పటి ఉప రాష్ట్రపతి వీవీ గిరి ప్రశంసలు అందుకుంది.

## తెలుగు వెలుగుల నిర్మాణం

జీవిత పరిచయం, కోశాల నిర్మాణం డాక్టర్ వెంకటప్పయ్య గారి అభిమాన అంశాలలో ఒకటి. ఆయన చేతుల మీదుగా పలు కోశాలు వెలువడ్డాయి. వాటిలో చెప్పుకోదగ్గది 20వ శతాబ్దపు తెలుగు వెలుగులు. గత శతాబ్దంలో పరమపదించిన తెలుగు ప్రముఖుల పరిచయాలతో ఈ గ్రంథం రూపొందింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా వెలువడిన ఈ కోశంలోని రెండు భాగాలు 2005లో ప్రచురితమయ్యాయి. వీటిని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారు. ఈ కోశంలో ఇంకా 3-4 భాగాలు వెలువడాల్సి ఉంది. మొత్తం కోశంలో 300 మంది ప్రముఖుల వివరాలు ఉన్నాయి. ఇక, 19వ శతాబ్ది తెలుగు వెలుగులులో దాదాపు 800 మంది ప్రముఖుల పరిచయాలు ఉన్నాయి. ఇది కూడా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా ప్రచురితం కావాల్సి ఉంది. 'గ్రంథాలయ సేవా నిరతులు'లో దాదాపు 300 మంది ప్రముఖుల వివరాలున్నాయి. 2008లో దీనిని ప్రచురించారు. ఇంకా అయ్యంకి వెంకట రమణయ్య, శరణు రామస్వామి చౌదరి, అడుసుమల్లి శ్రీనివాసరావు, జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి, వై. ఆదినారాయణరెడ్డి, శనివారపు సుబ్బారావు, గుత్తికొండ రామబ్రహ్మం, నన్నపనేని వెంకటేశ్వర్లు, యడ్లపాటి వెంకట్రావు, జి.వి.కృష్ణారావు తదితరుల జీవిత చరిత్రలు వెంకటప్పయ్య గారి చేతుల నుంచే రూపు దిద్దుకున్నాయి.

## ఎలక్ట్రానిక్ జ్ఞాన యజ్ఞం

ఇప్పుడంతా టెక్నాలజీ యుగం. ఎలక్ట్రానిక్ మాధ్యమానిదే ప్రాధాన్యం. పౌర గ్రంథాలయ రంగం కూడా ముద్రణ మాధ్యమం నుంచి ఎలక్ట్రానిక్ మాధ్యమం వైపు పరుగులు పెట్టాల్సిన సమయమిది. తెలుగు గ్రంథాలను డిజిటలైజ్ చేసి వెబ్‌లో పెట్టి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే యత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ జ్ఞాన యజ్ఞంలో వెంకటప్పయ్య గారు తమ వంతు పాత్ర పోషించారు. ఎన్ఐఆర్‌డీ (హైదరాబాద్) సాయంతో తెనాలి శాఖా గ్రంథాలయంలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ కియోస్క్‌ను ప్రారంభించారు. డిజిటలైజేషన్ ప్రాజెక్టు నిర్వహణ కోసం హైదరాబాద్‌లో ఏర్పడిన సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చరల్‌లో ఆయన క్రియా శీలక సభ్యులుగా ఉన్నారు. వెంకటప్పయ్య అమెరికాలోని పిట్స్‌బర్గ్ కార్నిగీ - మెల్లన్ యూనివర్సిటీలో యూనివర్సల్ డిజిటలైజేషన్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాథమికాంశాలను అధ్యయనం చేసి భారత డిజిటల్ లైబ్రరీపై సాధికార సమాచారం సేకరించి అందచేశారు. వాషింగ్టన్‌లోని లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్, భారత ప్రభుత్వం సంయుక్తంగా మూడు వేల గ్రంథాలను మైక్రోఫిల్మ్ చేసేందుకు వెంకటప్పయ్య సహకారం అందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ వారి పత్రికల డిజిటలైజేషన్ ప్రాజెక్టులో ఈయన నామినేటెడ్ సభ్యులుగా ఉన్నారు. 150 ఏళ్ల పత్రికలకు దాదాపు 400 సీడీల తయారీకి చేయూతనిచ్చారు.

## పెద్దల విద్యపై ప్రత్యేక శ్రద్ధ

పౌర గ్రంథాలయ రంగానికి, వయోజన విద్యా ప్రచారానికి మధ్య విడదీయలేని సంబంధం ఉంది. దురదృష్టం ఏమిటంటే రెండింటి మధ్య సహకారం, సమన్వయం లేకపోవడం. అయితే రెండింటి మధ్య సరూప్యాన్ని గుర్తించిన వెంకటప్పయ్య పౌర గ్రంథాలయ రంగంలో నిరంతర

సేవలందిస్తూనే వయోజన విద్య కోసం కూడా విశేష కృషి చేశారు. వయోజనులు తెలుగు భాషను తేలిగ్గా నేర్చుకోవడంలో, కొత్తగా అక్షరాస్యులైన వారి కోసం దాదాపు 30 గ్రంథాలను రచించారు. ఈ కృషికి గుర్తింపుగానే నాలుగు సార్లు జాతీయ స్థాయి కేంద్ర ప్రభుత్వ అవార్డులు వరించాయి. వయోజన విద్యా రంగంలో చేసిన సేవలకు గాను ఒకసారి స్వయంగా రాష్ట్రపతి నుంచి ఆహ్వానం అందుకున్నారు. కొత్తగా అక్షరాస్యులైన వారి కోసం దాదాపు 30 గ్రంథాలను రచించిన ఆయన మరో 120 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. భారత వయోజన విద్యా సంఘంలో జీవితకాల సభ్యునిగా ఉన్న ఆయన రచించిన 'తెలుగు చదువు చాలా తేలిక', 'తెలుగు రాత చాలా తేలిక' పుస్తకాలు విశేష ప్రాచుర్యం పొందాయి.

## "బాలబంధు".. డాక్టర్ వెలగా

బాల సాహిత్యంపై ఎంతో మక్కువ కలిగిన డాక్టర్ వెంకటప్పయ్య వారి కోసం దాదాపు 60 పుస్తకాలు రాశారు. మరో 140 పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. అలాగే 6-9 ఏళ్ల పిల్లల కోసం 350 మల్టీకలర్ ఫ్లాష్ కార్డులను తయారు చేశారు. ఇంకా పిల్లల కోసం 3 వేల పొడుపు కథలు, 600 జానపద గేయాలు సేకరించారు. సుప్రసిద్ధ బాల సాహితీవేత్త చక్రపాణి గారు జన్మించిన గ్రామంలో పుట్టిన కారణమో మరొకటో కానీ... చిన్నప్పటి నుంచే చందమామ కథల పుస్తకం చదివిన అలవాటు వల్ల బాల్యం నుంచే బాల సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్నారు. విద్యార్థిగా ఉన్నపుడే 1949లో బంగారు బొమ్మల కథల పుస్తకాన్ని వెలువరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి కృషిని గుర్తించి 'బాలబంధు' అవార్డుతో సత్కరించింది. "తెలుగులో బాల సాహిత్యం- ఆంధ్రప్రదేశ్ బాలల గ్రంథాలయ ప్రగతి" అనే అంశంపై ఆయన పరిశోధన చేసి ఆంధ్రా యూనివర్శిటీ నుంచి పీహెచ్.డీ., డిగ్రీ పొందారు. ఇదే థీసీస్‌కు ఉత్తమ సిద్ధాంత గ్రంథంగా త్రిపురనేని గోపీచంద్ స్వర్ణపతకం లభించింది. తెలుగు వారి మెగా పెద్ద బాలశిక్షను 1200 పుటలతో పెద్దసైజులో ప్రచురించారు. బాలల

సాహితీరంగంలో ఆయన చేసిన కృషికి మెచ్చి వరించిన పురస్కారాలెన్నో! ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ (న్యూఢిల్లీ) నుంచి నీతా పురస్కారం ఆయన అందుకున్న పురస్కారాల్లో ప్రధానమైనది. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ కార్యవర్గంలో సభ్యత్వం కలిగిన ఆయన పలుచోట్ల పిల్లల కోసం శిక్షణ శిబిరాలను నిర్వహించారు.

## ప్రజ్ఞాశాలి.. ధర్మనిధి

ధర్మ, సేవాపరాయణుల జీవితం ఏ ఒక్క రంగానికో, అంశానికో పరిమితం కాదు. వారిలోని విశాలదృష్టి సమాజంలోని అన్ని రంగాలను స్పృశిస్తుంది. గ్రంథాలయ రంగంలో విశేష కృషి చేసిన ఆయన ఇటు సేవా రంగంలోనూ చెరగని ముద్ర వేశారు. తనను అభిమానించే వారి సహకారంతో గ్రంథాలయ, సాహిత్య రంగంలో ప్రముఖుల చేయూతతో కొన్ని ధర్మసంస్థలను ఏర్పాటు చేశారు. ఆ విధంగా వారిని వెలగా చిరస్మరణీయులుగా మార్చారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో అయ్యంకి, గాడిచర్ల, పర్వతనేని పేరిట ధర్మ నిధులు ఏర్పాటు చేశారు. తెనాలి గ్రంథాలయంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు, కొత్త గ్రంథాల కొనుగోలుకు ఆలపాటి కళాపీఠానికి రూపురేఖలనిచ్చారు. రేపల్లె శాఖా గ్రంథాలయంలో పరుచూరి రామకృష్ణ ట్రస్టును ఏర్పాటు చేశారు. చిలుమూరులో చక్రపాణి ధర్మనిధికి ప్రాణం పోశారు. ఏటా ఈ నిధులతో బాల సాహిత్య వేత్తను సన్మానిస్తారు. గుంటూరులో అయ్యంకి- వెలగా పురస్కార ధర్మనిధి.. ఏటా ఉత్తమ సమాజ సేవకుడిని, గ్రంథాలయ సేవానిరతుడిని ఎంపిక చేసి సన్మానించేందుకు రూ. 4 లక్షలతో ఈ నిధిని ఏర్పాటు చేశారు. తెనాలి శాఖా గ్రంథాలయంలో ఏటా కొండూరి వీరరాఘవాచార్యుల ధర్మనిధితో శిల్పిని సన్మానిస్తారు. 2009లో ప్రొఫెసర్ కౌలా గ్రంథాలయ సమాచార విజ్ఞాన నిధి ఏర్పాటు. ఈ నిధి మూలధనం రూ. 5 లక్షలు. ఏటా ప్రముఖ సాహితీ వేత్తల ఉపన్యాసాలు ఇచ్చేందుకు ఈ మొత్తాన్ని వెచ్చిస్తారు.

## నిరాడంబరతకు మారుపేరు

డాక్టర్ వెంకటప్పయ్య తన జీవిత కాలంలో సంపాదించుకున్న ఆస్తి తరగని విజ్ఞానం మాత్రమే. ఆయన ఇప్పటికీ సగటు మనిషిలాగానే జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఆర్థిక స్థితి మెరుగుపడినా జీవన విధానంలో ఏమాత్రం మార్పులేదు. ఎనిమిది పదుల వయసులో ఇప్పటికీ ఎక్కడికి వెళ్లాలన్నా ఎక్కువగా కాలినడకే ఆయన ప్రయాణ సాధనం. ఆయనకు నలుగురు కుమారులు. అందరూ ఉన్నత చదువులు చదివి జీవితాల్లో స్థిరపడ్డారు. ఎవరికీ కట్నాలు తీసుకోకపోవడం మరో విశేషం. లాంఛనాల మాటే లేదు. అతి సాధారణ కార్డులపై వివాహ ఆహ్వాన పత్రాలు ముద్రించారు. దానిపై తన కుమారుల ఉద్యోగ హోదాలను ప్రస్తావించకపోవడం ఇంకో విశేషం. వివాహం కుటుంబానికి సంబంధించిన పూర్తి వ్యక్తిగత వ్యవహారమని డాక్టర్ వెంకటప్పయ్య గారి నిశ్చితాభిప్రాయం.

## పుస్తకమే శ్వాస.. ధ్యాస

డాక్టర్ వెలగా వెంకటప్పయ్య గారి జీవితం తెరిచిన పుస్తకం. దాని నిండా గ్రంథాలయాల అభ్యున్నతి, సేవానిరతికి పాటు పడిన వైనాలే అనుభవాల దొంతరలు. జానపద సాహితీ రంగంలోనూ ఆయన విశేష కృషి చేశారు. 1978 సమయంలో ఆయన కడపలో ఉద్యోగం చేసినపుడు జానపద సాహిత్య సేకరణపై దృష్టిసారించారు. జనం నోళ్లలో మాత్రమే మిగిలిన, కనుమరుగై పోవడానికి సిద్ధంగా ఉన్న దాదాపు మూడు వేల పొడుపు కథలను సేకరించి వాటిని ప్రచురించారు. గ్రామాలలో పిల్లలు పాడుకునే గేయాలు, వాటి సంప్రదాయ గేయాలను 600 వరకు సేకరించి ప్రచురించారు. తెలుగులో రాయలసీమ పలుకు బడుల ప్రత్యేకతే వేరు. అవి చాలా అర్థపూరితమైనవి. అటువంటి వాటిని వెయ్యి వరకు సేకరించి సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులచే వివరణ రాయించారు. అన్నిటినీ కలిపి 'రాయలసీమ పలుకుబడులు' పేరుతో వెలువరించారు. రాయలసీమకు

చెందిన వెయ్యికి పైగా పొడుపు కథలను సేకరించి ప్రచురించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జానపద సాహిత్యంపై సదస్సు నిర్వహించిన సమయంలో రాయల సీమ జానపద సాహిత్యంపై సిద్ధాంత పత్రాన్ని సమర్పించారు.

ఇక పుస్తకాల సేకరణ, వితరణ అనేది డాక్టర్ వెలగా వెంకటప్పయ్య గారికి నిరంతర వ్యాపకం, డాక్టర్ డీఎన్ రావు, ద్వివేదుల విశాలాక్షి, ఆర్ఎస్ సుదర్శనం, వసుంధరాదేవి, కొల్లి శారద, ఆవుల మంజులత, ఆలపాటి బాపన్న- రవీంద్రనాథ్ గారి జ్ఞాపకార్థం ఇచ్చిన లక్షల విలువైన వేలాది గ్రంథాలను రాష్ట్రంలోని పలు గ్రంథాలయాలకు ఉచితంగా అందచేశారు. ముఖ్యంగా ఆలపాటి బాపన్నగారు ఉచితంగా అందించే పోటీ పరీక్షల గ్రంథాలు వెలగా వారి ద్వారా ఆయా గ్రంథాలయాలకు అందచేశారు. ఇవికాక తాను స్వయంగా కొన్నవీ, కాంప్లిమెంటరీగా వచ్చేవి కనీసం సంవత్సరానికి మూడు వందల వరకు ఉంటాయి. ఇలా తను జీవితకాలంలో సేకరించిన అరుదైన గ్రంథాలు, పత్రికల సంపుటాలను గుంటూరులో నిర్వహించే అన్నమయ్య గ్రంథాలయానికి చేరవేశారు. ఇలా ఆయన ప్రతి రంగం ప్రతి పనిలో తనదైన ముద్ర వేశారు. నిరంతర కృషికి రూపెత్తిన ఋషిగా నిలిచారు.

## 'మన వారసత్వం' గ్రంథానికి సాహితీ పురస్కారం

తెలుగు సంస్కృతీ చరిత్ర, తెలుగువారి విజయ పరంపర, మేథాసంపత్తి, స్ఫూర్తిప్రదాతల పరిచయాలు తెలిపే 'మన వారసత్వం' గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2004 సంవత్సరానికి సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ పుస్తకాన్ని వెంకటప్పయ్య రచించారు. ప్రవాసాంధ్రుడు డాక్టర్ బాబు ఆర్. వడ్లమూడి సంపాదకత్వం వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆవుల మంజులత అధ్యక్షతన గత డిసెంబరు లో హైదరాబాద్‌లో ఏర్పాటయిన సభలో రాష్ట్ర హోంమంత్రి కె.జానారెడ్డి చేతులమీదుగా ఈ అవార్డును డాక్టర్ వెలగా ప్రదానం చేశారు.

# డాక్టరు వెలగా వెంకటప్పయ్య గారికి
# సంస్మరణ సందేశాలు

## నిత్య చైతన్యంకు మారుపేరు డా॥వెలగా

నిత్య చైతన్యానికి మారుపేరు డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారు. నిరంతర కార్య నిమగ్నతకు మారుపేరు. అనవసరమైన మాటలకు, అర్థరహితమైన చేష్టలకు ఆ నిఘంటువుల స్పెషలిస్టు, నిఘంటువులో స్థానంలేదు. అతి సాధారణమైన దుస్తులు, చేతిలో ఒక సాధారణమైన సంచి, పొడుగ్గా ఊగిసలాడుతూ దేవాలయ ప్రాంగణంలోకి ప్రవేశించి చెప్పవలసింది చెప్పి, యివ్వవలసిన కాగితాలు ఇచ్చి, సంచీలోని పుస్తకాలు పంచి, దైవప్రసాదాన్ని మరిచిపోకుండా తీసుకుని ఎలా నిశ్శబ్దంగా వచ్చేవారో. అంతే నిశ్శబ్దంగా సెలవు తీసుకొని వెళ్ళిపోయారు వెంకటప్పయ్యగారు. శాశ్వతంగా సెలవు పలికి వెడలిపోయారనే చేదు నిజాన్ని నా హృదయం యింకా స్వీకరించకుండా ఉంది.

కదిలిస్తే గ్రంథాలయోద్యమం, పుస్తక ప్రచురణ, సభలు, సమావేశాలు, గొప్ప వ్యక్తుల స్మృతులు, అది మంచి పని, మనంతోడ్పడాలి, అనే ఆకాంక్షలు మీరే చేయగలరు తప్పక చేయండి అనే వెన్నుబలమిచ్చే ప్రోత్సాహ పూరిత పలుకులు నిండు వ్యక్తిత్వంతో తన తోటి వారిని వెలుగుతో నింపే ఆశా కిరణం మన మధ్య లేరంటే నమ్మబుద్ధవడం లేదు. బృందావన్ గార్డెన్స్, శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయానికి అనుబంధ సంస్థ అన్నమయ్య గ్రంథాలయానికి తిరుమలతిరుపతి దేవస్థానముల వారితో అనుబంధం ఏర్పడడానికి వెంకటప్పయ్య గారి కృషే మూలకారణం. గ్రంథాలయం అభివృద్ధికి వారిచేయూత, నిరంతర తపన మరువరానిది. వారి మనస్సులో అన్నమయ్య గ్రంథాలయం ఒక భాగమై పోయింది.

*– శ్రీ లంకా సూరినారాయణ*

## గ్రంథాలయ గాంధీ

డా॥ వెలగా వెంకటప్పయ్యగారు కారణ జన్ములు. గ్రంథాలయాన్ని కోవెలగా భావించిన వెలగావారు అక్షరాలను దేవతలుగా భావించి నిత్యం అర్చిస్తున్న మహనీయులు. మనకు ఎప్పుడో స్వాతంత్ర్యం వచ్చింది. అది సమరయోధుల పుణ్యం. కానీ మన జనం అందరికీ సమాచార స్వాతంత్ర్యం ఇంకా రావలసి ఉంది. ఇందుకు కంకణం కట్టుకున్న మహానుభావులు, సమాచార స్వాతంత్ర్య సమర సేనాని వెలగావారు. ఆయన వయస్సును జయించారు. ఆయన ధాటికి వయస్సే క్రింద పడి ఓడిపోయింది. ఎనిమిది పదుల వయస్సులోనూ ఆయనలో పద్దెనిమిదేళ్ళ ఉత్సాహం తొణికిస లాడుతుంటుంది. సానుకూల దృక్పథం ఉండడమే తన విజయ రహస్యమని ఆయన చెబుతారు. అది అక్షర సత్యం. శిలాక్షర సత్యం. బాలసాహిత్యం మొదలుకొని ఆబాలగోపాల సాహిత్యం వరకు అందరికీ ఉపయోగకరమైన ఆయన సాహిత్యానికి కూడా ఎప్పుడో షష్టి పూర్తి దాటిపోయింది. తెలుగనాట ఉన్న అరుదైన మహావ్యక్తుల్లో ఆయన ఒకరు అని చెప్పడం నిస్సందేహం.

– *'హాస్యబ్రహ్మ' శంకరనారాయణ*

## తెనాలి వెలుగు వెలగా

వెంకటప్పయ్య కంటే నేను సుమారు ఏడు సంవత్సరాలు పెద్దవాణ్ణి. మాకు సమీప బంధువు. అతను చిన్నప్పటి నుంచీ తెలుసు. ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, విశేష శ్రమతో అత్యున్నత విద్యావంతుడై, రాష్ట్ర ప్రభుత్వంలో ఒక ఆఫీసరుగా అందరి ప్రశంసలు అందుకున్నారు. అంతకుమించి అపారమైన సంఖ్యలో రచనలు చేసి పలు పురస్కారాలు పొందారు. పదవీ విరమణ చేసిన పాతికేళ్ళ కాలంలో నిర్విరామంగా కృషిచేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వెంకటప్పయ్యను మనసారా అభినందిస్తున్నా. ఆయన్ని తెలుగు వెలుగుగా, తెనాలి వెలుగుగా నేనెప్పుడూ భావిస్తాను.

– కన్నెగంటి వెంకట్రావు

## నిత్య పరిశోధకుడు

డా॥ వెలగా వెంకటప్పయ్యగారు గ్రంథాలయ ఉద్యమ సారథి, బాలసాహిత్య పరిశోధకులు, గ్రంథాలయాల వ్యాప్తి కొరకు, బాలసాహిత్య పరిపుష్టి కొరకు వారు చేసిన కృషి ఎనలేనిది.

– *డా. సి. నారాయణరెడ్డి*

## గ్రంథాలే సేతువులు

ఆంధ్రాంగ్ల భాషలలో వెలువడిన పుస్తకాలపై వెలగా వారికున్న పరిచయం అపారం. అనుపమానం. మా ఇద్దరినీ తరచు కలిపే సేతువులు గ్రంథాలే.

– *నార్ల వెంకటేశ్వరరావు*

## జాతీయస్థాయి గౌరవం

గ్రంథాలయోద్యమంలో జాతీయ స్థాయిలో గౌరవం పొందిన ఆంధ్రులు నా దృష్టిలో ఇద్దరే. అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘ స్థాపన (1919)తో అయ్యంకి వెంకట రమణయ్యగారు, యావద్భారతావనికీ అవసరమైన మాదిరి పౌర గ్రంథాలయ చట్టాన్ని రూపొందించడంతో వెలగా వెంకటప్పయ్యగారు జాతీయ స్థాయిలో గుర్తింపుపొంది 'తెలుగు వెలుగు' అనిపించుకున్నారు.

– *టేకుమళ్ళ రామచంద్రరావు*

## వెంకటప్పయ్యగారు నిత్య బాలుడు !

'నమస్కారం బాగున్నారా?' ఏం చేస్తున్నారింకా....కొత్త పుస్తకాలు వచ్చాయా? మీకోసం అమెరికా నుంచి ఒక పుస్తకం తెచ్చాను తీసుకోండి...' అన్నది వెంకటప్పయ్యగారి ఎనిదేళ్ళ బాలుడి ఉత్సాహం. చూడడానికి ఓ పెద్దాయన, మనసుకు మాత్రం ఎంతో పిన్నవయస్సు. తెనాలిలోని ఐతానగరంలో ఓ వీధికి ఆయన పేర డాక్టర్ వెలగా వెంకటప్పయ్య మధ్య

శ్రమిస్తూనే ఉంటారు. ఎప్పుడూ ఏదో సదస్సు, అందరికీ ఆహ్వానాలు, పత్రరచనకు సంబంధించిన అంశాలపై చర్చ, ఎప్పుడొస్తున్నారని ఫోన్‌లో ఆరాతీస్తూ, కార్యక్రమానికి హాజరు కాగానే ప్రయాణ వివరాలు కనుక్కోవడం, భోజనాల విషయం ఆరాతీయడం, బహుమతులు, సన్మానాలు, ఆత్మీయ సమావేశాల అనంతరం సాగనంపడం వరకు ఆయనే చేస్తుంటారు. ఏదైనా ఒకపని అప్పగిస్తే అది పూర్తి చేసేవరకు మన వెంటే ఉంటారు. మనలను వెంటాడుతుంటారు. అందుకే ఆయన అంత ఎత్తుకు ఎదిగారు. అంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం. ఆయన ఆలోచన, బాలల గ్రంథాలయాలు ఆ పరిధిని మీరారు. గవర్నర్‌తో ఎంత ఆత్మీయంగా మాట్లాడతారో ఐదో తరగతి బాలలతోనూ అంతే చనువును ప్రదర్శిస్తారు. అందుకే ఆయన మోము నిరంతరం చిరునవ్వుతో వికసిస్తూనే ఉంటుంది. ఇలాంటి వారు సమాజంలో నూటికి కోటికి ఒక్కరు మాత్రమే... వారి పరిచయం, చనువు కలగడం అదృష్టంగానే నేను భావిస్తాను.

*– టి. వేదాంతసూరి*

## ఆదర్శమూర్తి

గ్రంథాలయోద్యమానికి తన జీవితం అంకితం చేసుకున్న ఆదర్శప్రేరితుడు డా॥ వెలగా వెంకటప్పయ్యగారు పాండిత్యం పరిపాలనాదక్షత భిన్న ప్రజలు అయితే డా॥ వెంకటప్పయ్యగారి గుండెలో ఆ రెండు ప్రజ్ఞలు గంగా, యమునల వలె సంగమించాయి.

*– డా॥ నందూరి రామకృష్ణమాచార్యులు*

## బాల సాహితీవేత్త – వెలగా

గ్రంథాలయ ఉద్యమానికి వెంకటప్పయ్యగారు పాతూరి నాగ భూషణం గారికి వారసులు బాలసాహిత్యం కోసం ఎంతో శ్రమించిన వారు. తెలుగు పెద్దల జీవిత వ్యక్తిత్వాలను అక్షరబద్ధం చేసినవారు. ఆయన ఎప్పుడో అన్న ఒక్కమాట ఇప్పటికీ నా చెవుల్లో ఎప్పుడూ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.

అది – "బాల సాహిత్యాన్ని రాయడానికి అందరూ బాలల స్థాయికి దిగాలంటారు. కానీ నా దృష్టిలో బాలసాహిత్యం రాయడానికి బాలల స్థాయికి ఎదగాలి".

– ద్వా.నా.శాస్త్రి

## నా మంచి మిత్రుడు

ఇక ముందు నా పరిశోధన అంతా మీ వంటి మిత్రుల సాయంతో జరగవలసి వుంది

– ఆరుద్ర

## మా మాస్టారు

తెలుగు బాల సాహిత్యంలో నేను పరిశోధన చేస్తున్న తొలి రోజులలో (1984) డాక్టర్ వెంకటప్పయ్యగారు పరిచయం అయ్యారు. నా పరిశోధనకు సంబంధించి ఎంతో సమాచారం నాకందించారు. వారి పరిచయం లేకపోతే నా పరిశోధన అంత సులభంగా పూర్తవుతుందనే నమ్మకం లేదు. వారి సహకారం లేనిదే ఎందరివో పరిశోధన వ్యాసాలు పూర్తయి ఉండేవి కావని నా విశ్వాసం. వారి ప్రేరణ పరిశోధన విలువలను పెంచుతుంది. వారు నాకే కాదు ఎందరికో మాస్టారు.

– జి. ప్రభావతి

## కొండంత మనిషి

ఒకసారి వేటపాలెం, సారస్వత నికేతన పాలక మండలి అధ్యక్షుడు కె.వి.డి.మల్లిఖార్జునరావుగారు మద్రాసువెళ్ళి తీరిక సమయంలో అమెరికన్ గ్రంథాలయాన్ని చూశారు. అచట పనిచేస్తున్న వల్లభజోస్యుల భాస్కరరావు గారిని కలసి "మీ గ్రంథాలయం ఎంతో బావుంది. మా గ్రంథాలయం బాగా నిర్వహించడానికి సూచనలివ్వండి" అన్నారు. వెంటనే భాస్కరరావు గారు మీ జిల్లాలోనే ఉన్నారు గదా! వారికి తెలియందిలేదు" అన్నాడట మల్లిఖార్జునరావుగారు అందుకొని "వెంకటప్పయ్యగారి సేవలను ఈ

గ్రంథాలయానికి బాగా వినియోగించుకుంటాం” అని సెలవు తీసుకున్నారు. తదుపరి పలు సందర్భాలలో వారి సాయం మా గ్రంథాలయానికి లభించింది.

– కె. సుబ్రహ్మణ్యం

## తెలుగు బ్రౌన్

‘ఖ్యాతింగన్న’ తెలుంగు బ్రౌను ‘నాకు
వెల్గా వెంకటప్పయ్యకున్’ (పద్య భాగం)

– *బండ్లమూడి సత్యనారాయణ*

## నిరంతర విద్యకు ఉదాహరణ డాక్టర్ వెలగా

విద్య నిరంతరాయంగా సాగాలనేది విద్యావేత్తల భావన, కళాశాల వదిలింది మొదలు గ్రంథాలయమే విద్యాలయంగా డిగ్రీ నుంచి పై చదువంతా, అపార విజ్ఞానాన్నంతా గ్రంథాలయాల ద్వారానే సాగించారు. వయోజన విద్యలో ప్రధానాంశమైన నిరంతర విద్యకు (CONTINUING EDUCATION) నిర్విరామ కృషికి, నిజమైన ఉదాహరణ – మా బాబాయి వెంకటప్పయ్య గారు.

– *వాణీ రంగారావు*

## నిలువెత్తుగా నిలచేమూర్తి

గ్రంథాలయ విజ్ఞానం అనగానే కళ్ళ ఎదుట నిలచేమూర్తి డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారిది.... నాలుగు దశాబ్దాలుగా గ్రంథాలయ రంగంలో గణనీయమైన కృషి చేసినందుకు నా హార్ధికాభినందనలు.

– *డాక్టర్ సి. నారాయణరెడ్డి*

## ఉత్తమ మార్గదర్శి

మన గ్రంథాలయోద్యమానికి, బాలసాహిత్యానికి వెంకటప్పయ్యగారు చేసిన సేవ అందరికీ తెలిసిందే. వారి నిర్విరామకృషి అశేష ప్రతిభ, కార్యదక్షత

అందరినీ ఆకట్టుకుంటాము. వారి మార్గదర్శకత్వంలో గ్రంథాలయోద్యమం మరింత పటిష్టత కాగలదని నా విశ్వాసం.

– డాక్టర్ దాశరధి

## తొలి మిత్రుడు

గ్రంథాలయ రంగంలోకి నేను వచ్చేందుకు ప్రేరేపించింది డాక్టర్ వెంకటప్పయ్య నా కృషివెనుక వారి ప్రోత్సాహం, ఆశీస్సులు నిరంతరం ఉన్నాయి.

– డాక్టర్ పి. ఎస్. జి. కుమార్

## గ్రంథాలయ రంగంలో అగ్రగణ్యుడు వెలగా

ఆంధ్రదేశంలో గ్రంథాలయోద్యమంలో ఎందరో పెద్దలు - అయ్యంకి, గాడిచర్ల, పాతూరి, వావిలాల వంటి ప్రముఖులు గొప్పసేవ చేశారు. ఆ తరం ఐపోయింది. ఈ తరంలో అటువంటి సేవచేస్తున్నవారు ఎక్కువ మంది లేరు. ఉన్నవారిలో వెలగా వెంకటప్పయ్యగారు అగ్రగణ్యులు – వారు చిరకాలం ఆ సేవచేయడానికి భగవంతుడు ఆయురారోగ్యాలను పుష్కలంగా ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

– డాక్టర్ భావరాజు నరసింహారావు

## నడిచే విజ్ఞాన సర్వస్వం

గ్రంథాలయ శాస్త్రంలో స్వయంగా శోధితమైన పరిశోధనచేసి యావద్భారత కీర్తి ప్రతిష్టలు సంపాదించినవారు మన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శులు. నిరంతరాన్వేషణలో గ్రంథాలయ శాస్త్రంలో నాలుగు పదులకు మించిన గ్రంథాలు సిద్ధంచేసిన ప్రసిద్ధ రచయితలు డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారు గ్రంథాలయ నిర్వహణలో అనేక ప్రయోగాలుచేసి గ్రంథాలయాలను, గ్రంథాలను ప్రజలకు సన్నిహితం చేసి – గ్రంథాలయ నిర్వహణకు తనకు తానే సాటి అనిపించుకున్న జ్ఞాన యజ్ఞ సోమయాజివారు.

బాల సాహిత్యం, వయోజన విద్యలలో అనేక రచనలు చేసి, అనాదృత సాహిత్యాన్ని ఏర్చికూర్చిన సాహిత్య పిపాసివారు. స్వయంకృషి సాధనతో గత నూరేళ్ళ కాలంలో అచ్చయిన ప్రతి తెలుగు పుస్తకంతో పరిచయం ఏర్పరచుకున్న 'సంచలన విజ్ఞాన సర్వస్వం' వంటి వారు. సామాన్యులలో అసామాన్యులు వెలగా వెంకటప్పయ్యగారు.

*– జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

## గ్రంథాలయాలే ఊపిరి, ప్రాణం...

మాన్య మిత్రులు డాక్టర్ వెంకటప్పయ్యగారూ– మీ ఉద్యోగం గ్రంథాలయాలకు సంబంధించింది. అయితే మీ జీవితం, కృషి గ్రంథాలయోద్యమానికి అంకితమైనాయి. మీ ఊపిరి, ప్రాణం, ఆహారం, గాలి – అన్నీ గ్రంథాలయాలు గానే జీవిస్తున్నారు.

*– ఆవుల సాంబశివరావు*

## నా సోదరుడు

తనపేరుకు గ్రంథాలయం మారుపేరుగా నిలుపుకున్న సోదరుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య.

*– డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు*

## సంచార గ్రంథాలయం

నా దృష్టిలో డాక్టర్ వెలగావారు ఒక 'సంచార గ్రంథాలయం' అంటాను. నేనొకచోట "తెలుగుదేశపు తెలుగు పిల్లలు తెలుగు వెలుగు లండీ" అన్నాను. తెలుగు వెలుగులకు మెరుగుదిద్ది, విజ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్నారు మన వెలగావారు. గ్రంథాలయోద్యమంతో పెనవేసుకున్నవారు. గ్రంథాలయోద్యమానికి నిజంగా వెలగావారి వెలుగు ఒక వెలుగే. వారికి నేనన్నా, నా రచనలన్నా ఎనలేని అభిమానం.

*– న్యాయపతి రాఘవరావు*

## గుంటూరులో డాక్టర్ వెలగా వీధి

దాదాపు పదేళ్ళ క్రితం గుంటూరు బృందావన్ గార్డెన్స్ సమీపంలో ఒక వీధికి కొందరు మిత్రులు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య వీధి అని పేరు పెట్టారు. నిజంగా ఒక గ్రంథాలయ కార్యకర్త సేవలకు ఇది అపూర్వమైన గుర్తింపు. ఇదొక విశేషం. ఈ విధిలో మరో పెద్ద విశేషం ఏమంటే హంటింగ్‌టన్‌లాగా వెదికి వెదికి సేకరించిన లంకా సూర్యనారాయణగారి అపూర్వమైన, అరుదైన గ్రంథ సంకలనం ఈ వీధి చివరలో ఉంది. వారివద్ద దాదాపు 30 వేల ఉత్తమోత్తమ గ్రంథాలు, దాదాపు లక్షకు మించి ఎంపిక చేసిన విశిష్ట వ్యాసాల కత్తిరింపులు, పెయింటింగులు ఉన్నాయంటే ఆశ్చర్య పోతాం. తెలుగు బాషా, సాహిత్యాలలో, సంస్కృతి, చరిత్రా, కళారంగాలలో పరిశోధన చేసేవారు లంకావారి లైబ్రరీ చూడందే వారి కృషి అసంపూర్తిగానే ఉంటుంది. విఖ్యాత పత్రికా సంపాదకులు వి.ఎస్.రామన్, గ్రంథాలయ రంగంలో ప్రపంచ ప్రసిద్ధుడు ప్రొఫెసర్ పి.ఎస్.కౌలా ఈలైబ్రరీని దర్శించి ప్రశంసిచడం ఒక విశేషం. పుస్తకాల పురుషుడు (ఇది పురాణం లైబ్రరీ ఉండడం వెంకటప్పయ్యగారి జన్మ చరితార్ధం అయినట్లే.

– మండవ శ్రీరామమూర్తి

## గ్రంథాలయ జ్యోతి

అయ్యంకి తరువాతి తరంలో గ్రంథాలయ జ్యోతిని వెలిగించి, ఆ వెలుగులందించిన ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారు.

– పెనుమత్స శ్రీరామరాజు

## పౌర గ్రంథాలయ నిపుణుడు

కేవలం నిరంతరన సాధనతో, స్వశక్తితో, పౌర గ్రంథాలయ రంగ నిపుణుడుగా జాతీయస్థాయిలో గుర్తింపుపొందిన డాక్టర్ వెంకటప్పయ్యగారిని అభినందిస్తున్నాను.

– డాక్టర్ ఎస్. ఎస్.మూర్తి

## జాతీయస్థాయి గౌరవం

గ్రంథాలయోద్యమంలో జాతీయస్థాయిలో గౌరవం పొందిన ఆంధ్రులు నా దృష్టిలో ఇద్దరే. అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘ స్థాపన (1919) తో అయ్యంకి వెంకట రమణయ్యగారు, యావద్భారతావనికీ అవసరమైన మాదిరి పౌర గ్రంథాలయ చట్టాన్ని రూపొందించడంతో వెలగా వెంకటప్పయ్యగారు జాతీయ స్థాయిలో గుర్తింపుపొంది 'తెలుగు వెలుగు' అనిపించుకున్నారు.

*– టేకుమళ్ళ రామచంద్రరావు*

## మరో రంగనాథన్

డాక్టర్ వెలగా వెంకటప్పయ్య స్వయం కృషి పెట్టుబడిగా పైకివచ్చిన వ్యక్తి. వారు సాధించిన విజయాలు అద్భుతమైనవి. ఒక సామాన్య శాఖా గ్రంథాలయాధికారిగా ప్రవేశించి కేవలం నిరంతర కృషిచేత జాతీయ స్థాయికి ఎదిగారు. వారు త్వరలో మరో రంగనాథన్ కాగలరని నా ఆకాంక్ష. ఇది వాస్తవం. డాక్టర్ వెంకటప్పయ్య నాకు మిత్రుడు, హితుడు, మార్గదర్శి. ప్రపంచ గ్రంథాలయ రంగంలో వారొక ఆణిముత్యం. గ్రంథాలయ, సాంకేతిక శాస్త్రాలను వృద్ధిపరచి డాక్టర్ రంగనాథన్ వలె అమరుడు కాగలడని నా విశ్వాసం.

*– ఎం.వి.ఆర్. రావు*

## వెలగా కోవెల

దేవాలయాలున్న చోట భక్తులూ భక్తులున్నచోట దేవతామూర్తులు అనుసంధానకర్తలగు పూజారులు సహజంగా ఉంటారు. కొన్ని దేవాలయాలు మత సంబంధమైనవి – మరికొన్ని బ్రతుకుమార్గ నిబంధనమైనవి విశాల విశ్వంలో మతాతీతంగా – మానవ హితంగా – మనో సహితంగా వెలసిన దేవాలయాలు గ్రంథాలయాలు. అవి మౌనగానానికి ఆలయాలు. భాషాధ్యయనానికి ఆరామాలు. వెలగా కోవెలకు రెండు దశాబ్దాల క్రితం

వెళ్ళాను. నిరాడంబరంగా పూజాసామాగ్రి ముందుంచుకుని ప్రతిజ్ఞాభావంతో ప్రజ్ఞ ననునయిస్తూ చిరునవ్వుతో నన్ను ఆహ్వానించిన రోజు నాకు గుర్తుంది. “కాట్రగడ్డా మీ కవితలు చదివాను. ప్రచురిస్తే బాగుంటుంది. పైకి ప్రాకే అవకాశముంటుంద”న్న భావంతో నావెన్ను చరిచిన వెలగా వెంకటప్పయ్య గారు ఆనాడు ప.గో.జిల్లా కేంద్ర గ్రంథాలయాధికారి. ఆ చిరు ప్రోత్సాహం నాచే కలం పట్టించి - కవినిచేసి - కవితాజ్వాలను చేసింది. తపాలా శాఖోద్యోగియైన నేను కవితా వస్తువును నా జీవితాన తూకం వేసుకుంటూ నేటికి నడవగలగడానికి కారణం వెలగా వారి చిరుహాసపు పలకరింపులే.

*– కాట్రగడ్డ, ఏలూరు.*

## ధన్యజీవి వెలగా

క్షీణించిపోతున్న గ్రంథాలయాల మనుగడ కొరకు చివరి వరకు తపన పడిన శ్రీ వెలగా వెంకటప్పయ్యగారు ధన్యజీవి. యావద్భారత గ్రంథాలయోద్యమ చరిత్ర సగౌరవంగా స్మరించుకొనే అయ్యంకి వెంకట రమణయ్య రగిలించిన, తరువాతి తరానికి అందించిన స్ఫూర్తి వెలగా వెంకటప్పయ్య తనని వారసునిగా గుర్తించిన అయ్యంకి వారి ప్రతిష్ఠ మాసిపోకుండా పేరు నిలబెట్టారు వెలగావారు. పాత తరానికి చెందిన పుస్తకాల గురించి, నిఘంటువుల మీద వారికున్న సాధికారత ఆశ్చర్యం కల్గిస్తుండేది. మేం కలిసినప్పుడు పుస్తకాల గురించి, మంచి పుస్తకాల పునర్ముద్రణ గురించి తప్ప వేరే సంగతులు వారి నుండి వచ్చేవి కావు. ఆంధ్రుల తొలి అకారాది నిఘంటువు ‘ఆంధ్రదీపిక’ను మా ఫౌండేషన్ ప్రచురించడానికి వెలగా వెంకటప్పయ్య గారే ప్రేరణ. గుర్తుపెట్టుకొని మంచి పుస్తకాలను తరచూ పంపుతూ ఉండేవారు.

పెద్దరికం ఉట్టిపడే మాట, నడవడిక, గ్రంథాలయాల బాగు తప్ప ఇంకొక విషయం ఎరుగని కార్యదీక్షాపరులు వెంకటప్పయ్య గారి ఆకస్మిక అంతిమ ప్రయాణం ఆప్తులెవ్వరూ ఊహించనిది. తట్టుకోలేనిది.

*– బమ్మిడాల శ్రీకృష్ణమూర్తి*

వెలగా వెంకటప్పయ్యగారి సంపాదకత్వాన వెలువడిన "గ్రంథాలయ దర్శిని" అనే ప్రచురణ అభిలషణీయమైనది. శ్రమతో కూడిన ఈ పనికి పూనుకొని నందుకు వారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

– *బి. ఎస్. కేశవన్*

వెలగా వెంకటప్పయ్యగారికి పౌర గ్రంథాలయాలలోనూ, గ్రంథాలయ విజ్ఞానంలోనూ నిండు అనుభవం కలదు. పైగా గ్రంథాలయ రంగంలో చెప్పలేనంత ఆసక్తి గలవారు.

– *ఆర్. జనార్ధనమ్ నాయుడు*

గ్రంథాలయ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాలకు ప్రతీక డాక్టర్ వెంకటప్పయ్య.

– వావిలాల గోపాలకృష్ణయ్య

తమ జీవితాన్ని గ్రంథాలయ సేవకై అర్పించిన మిత్రులు డాక్టర్ వెంకటప్పయ్య

– *కోదాటి నారాయణరావు*

స్వయంకృషి ద్వారా అనుభవాన్ని, జ్ఞానాన్ని సంపాదించుకొని, సేవా పరాయణత్వంలో తాను నేర్చిన జ్ఞానాన్ని లోకానికందించే సంకల్పంతో కృషి చేస్తున్న డాక్టర్ వెలగా వెంకటప్పయ్యకు మా హృదయపూర్వక అభినందనలు.

– పాతూరి నాగభూషణం

వెలగా వెంకటప్పయ్యగారు గ్రంథాలయోద్యమంలో సంబంధం ఉన్న వారందరికి సుపరిచితులు. వయస్సులో చిన్నవారైనా విజ్ఞానం, కృషి ఈ రెంటి దృష్ట్యా వారి స్థానం అగ్రశ్రేణిలో ఉన్నది.

– దేవులపల్లి రామానుజరావు

ఆంధ్ర గ్రంథాలయోద్యమంపై పూర్తి అవగాహన కలిగిన వారిలో వెంకటప్పయ్య గారు ఒకరు. వారి నిరంతర కృషికి నా అభినందనలు.

– ప్రొఫెసర్ కాట్రగడ్డ శారద

## తెలుగు వారి మదిలో వెలగా

ఔను.. ఒక జాతిని నిద్రలేపటానికి, అనేక తరాలను విజ్ఞాన మూర్తులను చేయడానికి డా॥ వెలగా వెంకటప్పయ్య తాను కరిగే కొవ్వొత్తిలా వెలుగులు చిందిస్తూ ఎన్నో నిద్రలేని రాత్రులు మిక్కిలిగా గడిపారు. 82 సంవత్సరాల జీవిత కాలంలో 164 సంవత్సరాల పనులు చేయగలగటం ఆయనకే సాధ్యం అయింది.

– యమ్.యస్.వి. సత్యనారాయణ

## *మరో అయ్యంకి, మరో గాడిచర్ల మన వెలగా*

పొట్టి శ్రీరాములుగారు అనగానే ఆత్మాహుతి, ఆంధ్ర రాష్ట్రం గుర్తుకొచ్చి నట్లుగానే వెలగా వెంకటప్పయ్యగారు అనగానే గ్రంథాలయాలు గుర్తుకు వస్తాయి. అసలు ఆయనే ఒక గ్రంథాలయం. వెలగా మనస్సు గ్రంథాలయోద్య మానికి అంకితం.

*– డాక్టర్ సంజీవదేవ్*

## అరుదైన వ్యక్తి – స్ఫూర్తి ప్రదాత

జాతీయ గ్రంథాలయ ఉద్యమంలో తెలుగు జాతివారి పాత్ర తిరుగులేనిది. స్వాతంత్ర్య ఉద్యమానికి గ్రంథాలయ ఉద్యమాన్ని జతకలిపిన తొలితరం ఉద్యమనాయకులు గాడిచర్ల, అయ్యంకి వార్ల అనుంగు శిష్యుడిగా, ఆ తరంవారికి, నేటి తరానికి గ్రంథాలయ వారధిగా, చివరిక్షణం వరకు పుస్తకమే ఊపిరిగా జీవించిన వ్యక్తి వెలగా వెంకటప్పయ్య.

– మండవ శ్రీరామమూర్తి

## గ్రంథాలయ గాంధీ వెలగా

విజ్ఞాన భాండాగారాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కారం కనుగొన్న ప్రజ్ఞాశాలి. ఆయన కృషి రూపెత్తిన రుషి, నవ్వుతున్న తెలుగక్షరం, హితభాషి, మితభాషి, నడిచే విజ్ఞాన సర్వస్వం, సమాచార నిధి 'గ్రంథాలయ గాంధీ' వెలగా వెంకటప్పయ్యను గురించి ఇలాంటి విశేషణాలు ఎన్ని ఉపయోగించినా, ఇంకా ఎన్నో ఉంటాయి!

*– తుర్లపాటి కుటుంబరావు*

## నాకు స్ఫూర్తి వారే

గ్రంథాలయ రంగంలోనే కాక బాలసాహిత్యం, వయోజన విద్యకు సంబంధించి సరళమైన భాషలో అనేక పుస్తకాలు రచించారు. రచన రంగంలోనే గాక గ్రంథాలయ వ్యవస్థ పరిరక్షణ కొరకు పరితపించేవారు. అరకొర నిధులతో, చట్టపరమైన సమస్యలతో సతమత మయ్యే గ్రంథాలయ వ్యవస్థలో మార్పు కోసం తపించిన వ్యక్తి.

*– తిరుమలశెట్టి నరశింహారావు*

## గ్రంథాలయ శాస్త్ర ద్రష్ట – డాక్టర్ వెలగా

గ్రంథాలయ కార్యకర్తగా, రచయితగా, గ్రంథాలయోద్యమ రథసారధిగా వీరు యావదాంధ్రులకు సుపరిచితులే. వెంకటప్పయ్యా గార్ని గూర్చి తెలుగు వారికి నేను పరిచయం చేయబూనడం సూర్యుడ్ని దీపంతో చూపడానికి ప్రయత్నించడమే అవుతుంది.

*– పాతూరి విజయకుమార్*

## పలికే పుస్తకం – డాక్టరు వెలగా

స్వయం కృషితో హిమాలయోన్నత శిఖరమంత వ్యక్తిత్వాన్ని సంపాదించుకున్నారు. గ్రంథాలయ పాలకుడిగా జీవితాన్ని ప్రారంభించి చివరి

రోజు వరకు గ్రంథాల సేకరణ, భద్రతల గురించి, గ్రంథాలయాల అభివృద్ధి గురించీ తపిస్తూ, తెలుగు గ్రంథాలయ బోధనా శాస్త్ర పితామహుడిగా, గ్రంథాలయ శాస్త్రవేత్తగా వెంకటప్పయ్య చిరస్మరణీయుడయ్యారు.

– *మండలి బుద్ధప్రసాదు*

## గ్రంథాలయ జ్యోతి అందించిన వెలగా

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అన్నట్లు పుట్టిన గడ్డకూ జన్మనిచ్చిన తల్లికి ఋణం తీర్చుకోవాలంటే డాక్టర్ వెలగా వెంకటప్పయ్య గారితో స్నేహం చేయాలి. వారితో గడిపే ప్రతిక్షణం, నిమిషం ఎంతో విలువైనది. వారితో కలసి నడిచే అపూర్వ అవకాశం కల్గినందుకు భగవంతుడికి కృతజ్ఞతలు చెబుతున్నాను. వీరి ప్రత్యేకత ఏమిటంటే – చెప్పాలనుకున్నది సూటిగా చెప్పే సహజత్వంతో పాటు నిర్మొహమాటంగా మాట్లాడడం.

– *పావులూరి శ్రీనివాసరావు*

## కొందరిని మరువలేము !

ఎన్ని జ్ఞాపకాలు! నేనంటే నేనని ముందుకు తోసుకువస్తున్నాయి. ఏ జ్ఞాపకాన్ని ముందు రాయను? ఏమని చెప్పను? తెనాలి గడ్డ ఎంతమంది గొప్పవారిని కనిందో! వారిలో ఒకరయ్యారు డాక్టరు వెలగా వెంకటప్పయ్య గారు. స్వయంకృషితో, నిబద్ధతతో, ఎవరండదండలు లేకుండా పైకి వచ్చినవారు

– *గుడిపూడి సుబ్బారావు*

## ఉత్తమ సాహితీ వేత్త, ధృవతార – డా॥ 'వెలగా'

అవార్డులు, రివార్డులు, బిరుదులు, సన్మానాలు డాక్టర్ వెలగాను వెతుక్కుంటూ వచ్చాయి. మరో తరానికి స్ఫూర్తినిచ్చిన మహోన్నత వ్యక్తి డాక్టర్ వెలగా, 'బ్రతుకు–బ్రతకనివ్వు' అనే సిద్ధాంతాన్ని నమ్మినవ్యక్తి.

అనేకమంది రచయితగా ఎదగడానికి ఎంతగానో ప్రోత్సహించిన నిస్వార్థ సాహితీవేత్త, ఈర్ష్యా ద్వేషాలకు అతీతంగా తోటి రచయితల అభ్యున్నతికి చేయూతనిచ్చే సహృదయం వారిది.

*– షేక్ అబ్దుల్ హకీం జాని*

పౌర గ్రంథాలయ రంగంపై పూర్తి అవగాహన గలవారు.

*– కాట్రగడ్డ శారద*

వెంకటప్పయ్యలాగా పనిచేసేవారుంటే దేశం ఏనాడో బాగుపడేది.

*– పండిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్య*

నాడు గ్రంథాలయోద్యమంలో అయ్యంకి, గాడిచర్ల, వావిలాల గొప్ప సేవ చేశారు. ఆ తరం అయిపోయింది. ఉన్నవారిలో వెలగా వెంకటప్పయ్య గారు అగ్రగణ్యులు.

*– భావరాజు నరసింహారావు*

నడిచే విజ్ఞాన సర్వస్వం. సమాచార నిధి.

*– రావినూతల శ్రీరాములు*

Dr Velaga Venkatappaiah is the only the person available in India with expertise in the field of library legislation.

*- Prof P N Kaula*

Dr Velaga Venkatappaiah is the only person, who has clear understanding about public library system in the State. He is a source of inspiration to many a person.

*- Gopal Rao Ekbote*

No Librarian, in general, is so popular among the scholars and masses like Dr Velaga. His name has eventually become synonym for the word library, in the State.

*- Dr Sanjiva Dev*

Indian colleagues, when asked, told me he was an elderly man, of over 60, who had just retired. But what away to be 60 ! When I met him, I found an extremely active, youthful person, who enjoyed excellent physical health. Retirement for him had meant nothing more than moving house and perhaps a change in working hours.

*- Emilia Curras*

This is to congratulate you for drafting an excellent document (Model Public Libraries Act).

*- Prof Kishan Kumar*

The extremely good work you have doing for the cause of Library Science and the development of libraries in part of Andhra Pradesh is unparralled.

*- Dr D N Rao*

Dr Velaga always thinks of Public Libraries work only, throughout the twenty four hours, the week, the month and the year.

*- Dr B Ramesh Babu*

# వెలిగే దీపం మన “వెలగా”

– డాక్టర్ బీరం సుందరరావు

తెలుగు నాట మన “ వెలగా”
వెలిగే గ్రంథాలయం!
పుస్తకాల మధ్యలోన
కదిలే జ్ఞానాలయం!!
గాడిచర్ల, అయ్యంకి
వావిలాల, పాతూరి
వారసుడై నిలిచినారు!
జనహృదయం గెలిచినారు!!
గ్రంథాలయం ఊపిరిగా
బ్రతుకంతా గడిపినారు!
పుస్తకాలె తన సిరిగా
జీవితాన్ని నడిపినారు!!
వెలగా పుస్తకాల వెలుగై
తెలుగు జాతి గర్వమాయె!
వెలగా సేవలె మనకు
వెలుగుచూపు దారులయ్యె!!
రచనలెన్నో చేసినట్టి
రూపెత్తిన కృషిరూపం!
లైబ్రరీలు నిలిపినట్టి
మన కాలపు జ్ఞానదీపం!!
కొత్త తరం భుజం తట్టి
ప్రోత్సాహం ఇచ్చినారు!
మంచి రచన చేయగానె
మనసులోన మెచ్చినారు!!

ప్రతి నిముషం బాలలకై
బ్రతుకంతా సాగినారు!
పొదుపు కథలు కూర్చినారు
పొద్దు పొడుపు తెచ్చినారు!!
వేల వేల సభలలోన
తన వాణిని విన్పించెను!
లోకమంత తిరిగి తిరిగి
లైబ్రరీలు వెలిగించెను!!
ప్రతి మనిషికి గ్రంథాలయం
కావాలనె దేవాలయం
గుండె గదిలో పుస్తకాలు!
మన వెలగా జ్ఞాపకాలు!!
పదవులెన్నొ నిర్వహించె!
ప్రభుత్వం గౌరవించె!
పత్రికలూ శ్లాఘించె!
సంస్థలెన్నొ సత్కరించె!
ఇంటి పేరు లోన వెలుగు
కంటి చూపు నందు కరుణ
మనసంతా మానవత్వం!
ప్రవర్తనలో ఋషితత్వం!
ఆచరణకు మారుపేరు
ఆత్మీయత వారి తీరు
తెనాలి గడ్డమీద
మన “వెలగా” గొప్పవారు.

# వెలగా పెద్దబాలశిక్ష

– డి. సుజాతాదేవి

నీవొక పెదబాలశిక్షా
నిరంతరం నిరంతరం నిన్ననుసరించితే
తరంతరం తరిస్తుంది.......... ॥నీవొక॥
నీ నడచిన విధానమే మా నిదానము
నీ నుడివిన తెలుగుదనము మా ధనము
అనుసరణీయం మార్గం ఆచరణీయం
మిత భాషణం – హిత భాషణం
నతులు నుతులు గానుమా! .....॥నీవొక॥
మౌన భాషణ రుషివి నీవెగా
మూసి ఉన్న పుస్తకము వలె
పుస్తకమె సమస్తమని
గ్రంథాలయోద్ధరణ – దీక్ష పూనితివి !...॥నీవొక॥
బాలకులే పౌరులు, పాలకులని
శిశు సాహితి పరిశోధించితివి
పరిశోధనలో పారమెరిగి
ఆ సారమును మా అందరికి పంచితివి ! .... ॥నీవొక॥
పసివారికి నడవడిక తెలుపుటకు
బాలసాహితి నెలకొంది
ఆ రచనలు చేయగా
మెలకువనెరిగే – శిక్షణ తరగతులిస్తావు!
నవ సృష్టికి బాటలు వేస్తావు !! ..... ॥నీవొక॥